క్లుప్తంగా

యూరో కిడ్స్ ప్రీ స్కూల్ ప్రారంభం



స్కూల్‌ను ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ పల్లె రోడ్డులో చిన్నారుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన యూరో కిడ్స్ ప్రీ పాఠశాలను శనివారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తొండూరు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల విద్య కోసం పాఠశాలను ఏర్పాటు చేసినందుకు వారిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం శేషసాయికుమార్, శేషసాయి నిఖిల్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ శరణ్యలు వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కుటుంబ సభ్యులు శ్రీరామసుబ్బయ్య, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, నాయకులు సోపాల వీరా, ఐటీఐ ఆంజనేయులు, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు : జమ్మలమడుగు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. శనివారం స్థానిక సివిల్‌కోర్టు ఆవరణలో అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవగుడి నారాయణరెడ్డి, సెక్రెటరీగా మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భూతమాపురం సుబ్బారావు, జాయింట్ సెక్రటరీగా కుండా లోకేష్, ట్రెజరర్‌గా జ్యోతిరాణి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా చంద్రశేఖర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాలాజి రవికుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

మండలానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు

ఎర్రగుంట్ల : మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా కానుకలో భాగంగా 43 వేలు పాఠ్యపుస్తకాలు ఎర్రగుంట్లకు వచ్చాయని మండల విద్యాశాఖ అధికారులు శివప్రసాదు, వేంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం 50 శాతం పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు త్వరలోనే వస్తాయన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న బీవీ సుబ్బారావు, తదితరులు

పులివెందుల టౌన్ : ముద్దనూరు రోడ్డులోని దివ్యాంగుల భవనంలో రిటైర్డ్ టెలికాం ఇంజనీర్ బీవీ సుబ్బారావు దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు సునీల్‌కుమార్‌శర్మ, వికలాంగులనెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు తపాలా డివిజన్‌కు అవార్డులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు తపాలా డివిజన్ ఉద్యోగులు గడచిన ఆర్థిక సంవత్సరంలో వివిధ అంశాల్లో 6 అవార్డులు సాధించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ తపాలా సర్కిల్‌కు సంబంధించి విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. అన్ని విభాగాల్లో పనితీరు, నికర కొత్తపొదుపు ఖాతాల ప్రారంభం, అత్యుత్తమ బట్వాడా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో కొత్త ప్రీమియం సేకరణ, జనరల్ ఇన్సూరెన్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనపరచినందుకు ఈ అవార్డులు పోస్టల్ డివిజన్‌కు లభించాయని పోస్టల్ సూపరింటెంట్ జి.కిరణ్ తెలిపారు ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్, ఉన్నతాధికారుల నుంచి ఈ అవార్డు అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పోస్టల్ డివిజన్‌లోని ఉద్యోగులను అభినందించారు.

ఘనంగా ఉద్యోగ విజయోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం డిప్లమో పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉద్యోగ విజయోత్సవ వేడుకలను జరుపుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగివేమన ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు జయచంద్రారెడ్డి, జయరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకునే సమయంలోనే మంచి నైపుణ్యాలను సంపాదిస్తే సులభంగా ఉద్యోగాలు సాధించవచ్చన్నారు.

అంజనీ పుత్రుడికి భక్తుల నీరాజనం

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



పులివెందులలో ట్రాక్టర్ పల్లకిలో ఉన్న ఆంజనేయస్వామి ఉత్సవమూర్తి



వేంపల్లెలో రామలక్ష్మణసీత హనుమంతుని వేషధారణలో చిన్నారులు



వేంపల్లెలో నూతన కవచంతో దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి



నగరిగుట్ట ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు



పులివెందులలో సాగుతున్న హనుమాన్ శోభ యాత్ర



చక్రాయపేటలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : హనుమజ్జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని అంజన్న ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి, పడమటి ఆంజనేయస్వామి, కోతి సమాధి ఆంజనేయస్వామి, పీడబ్ల్యూ ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరిగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రారంభించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే కడప రోడ్డులోని ఆర్‌ఆర్ లేఅవుట్‌లో వెలసిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు రామ్‌కుమార్ శర్మ స్వామి వారికి సహస్ర లడ్డూ నివేదన, లక్షపత్రార్చన నిర్వహించారు. కదిరిరోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్టీసీ డ్రైవర్ షరీఫ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా హనుమాన్ శోభ యాత్ర

హనుమజ్జయంతి సందర్భంగా పట్టణంలో హనుమాన్ శోభ యాత్ర వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం నూతన ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి శోభ యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర కొత్త బస్టాండు నుంచి కచేరి రోడ్డు, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, ఆర్టీసీ సర్కిల్ మీదుగా అంబకపల్లె రోడ్డులోని రామాలయం వరకు సాగింది. కార్యక్రమంలో హిందు భక్తులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మార్కెట్ వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి, బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ పిచ్చాంజనేయ స్వామి ఆలయంతో పాటు గంగవరం, కోగటం, కుంట, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, రామాపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. పలుచోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు. ఎర్రగుడిపాడు–పందిళ్లపల్లె గ్రామాల మధ్య వెలసిన ఆంజనేయ స్వామి గుడి వద్ద నిర్వహించిన కోలాటాలు అలరించాయి.

చక్రాయపేటలో..

చక్రాయపేట : స్థానిక శ్రీవేంకటేశ్వర, రాచరాయ స్వామి ఆలయాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర జై శ్రీరాం నినాదాలతో మారు మ్రోగింది. చక్రాయపేట మండలంలో నుంచే కాకుండా వేంపల్లె మండలం నుంచి కూడా పలువురు యువకులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. శ్రీవేంకటేశ్వర రాచరాయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈశోభాయాత్ర గండి వీరాంజనేయస్వామిని దర్శించుకుని అక్కడి నుంచి అద్దాలమర్రి, చెరువుకాంపల్లె, దళితవాడ, కుమార్ల కాల్వ, వెన్నపల్లె, సిద్దారెడ్డిపల్లె తదితర పల్లెలమీదుగా చక్రాయపేటకు చేరుకుంది. ఆలయ మాజీ చైర్మన్‌లు చక్రపాణిరెడ్డి, ఓబుళరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. శోభాయాత్ర సందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ హనుమాన్ వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గండి సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలో వాడవాడలా శ్రీహనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి సందర్భంగా ఉదయమే స్వామి వారికి అభిషేకాలు జరిగాయి. ముద్దనూరులో ఉమ్మడిశెట్టి గార్డెన్స్‌లోని శ్రీ వరదాంజనేయస్వామి ఆలయంలో ఉదయం హోమం, అభిషేకం, ఆకుపూజ, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ అర్చకులు ప్రవీణ్ నేతృత్వంలో పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, దేవత ఆరాధన, కలిశ ఆరాధన, మూర్తిహోమం, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయస్వామి నూతన కవచముతో దర్శనం ఇచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. హనుమాన్ నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. కవి డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో రామలక్ష్మణసీత హనుమంతుని వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన కోలాటం నృత్యం భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కురాకుల వెంకటేష్, ఈవో విశ్వనాథరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రంగప్రసాద్, వృషభాచలేశ్వర స్వామి భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానిక సంగాలపల్లెలో వెలసిన అంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దేవిరెడ్డి మల్లి కార్జున్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీరపునాయునిపల్లెలో ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కసనూరు, అంకాలమ్మగూడూరు, బలపనూరు, గురిజాల, తదితర గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నిడివెల ఆంజనేయస్వామి దేవాలయంలో అర్చకులు మధుసూదన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

01పీఎల్‌వీడీ252–170089: సింహాద్రిపురంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ రకాల పూజలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కుంకుమార్చనతో పాటు హనుమాన్ చాలీసాను పఠించారు. ఎర్రగుంట్ల, చిలంకూరు, తిప్పలూరు గ్రామాలలోని పూజలు నిర్వహించారు. కలమల్ల గ్రామంలోని హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక బ్రాహ్మణవీధిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు వైభవంగా నిర్వహించారు. పుష్పగిరి పీఠాధిపతి అభినవ ఉద్దండ విద్య శంకరభారతిస్వామి వారి ఆశీస్సులతో వేద పండితులు సుప్రభాత సేవతో పూజలను ప్రారంభించారు. భక్తులు తీసుకువచ్చిన పంచామృతాన్ని ఉత్సవ విగ్రహానికి తమ స్వహస్తాలతో అభిషేకం నిర్వహించారు. సాంబరాజు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. నెల్లూరు బృందం చేసిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. పెన్నానది ఒడ్డున వెలసిన ఆంజనేయస్వామి, బుడ్డాయిపల్లి జాతీయ రహదారిపై వెలసిన ఆంజనేయస్వామి, రామనపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని గ్రామాలలో హనుమజ్జయంతి వేడుకలను శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. పెద్దపుత్త శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలను నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. గోటూరు అభయాంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ఆకు పూజలను నిర్వహించారు. కుమారునిపల్లె సమీపంలోని వరాల ఆంజనేయస్వామి ఆలయంలో, వల్లూరులోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపాఘ్ని నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలను నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. రాత్రి దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీ, ధర్మాపురం కాలనీల్లో స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

అరటి పంటలపై రైతులకు అవగాహన

పులివెందుల రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో అరటి పంట సాగుచేసే రైతులకు వ్యవసాయంలో నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుశీల, శాస్త్రవేత్తలు నాగేంద్రారెడ్డి, సునీల్‌కుమార్‌లు రెండు రోజులుగా పెద్ద రంగాపురం, పులివెందుల, నల్లపురెడ్డిపల్లె, వేముల, బెస్తవారిపల్లె గ్రామాల్లో ఉద్యాన రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించామన్నారు. అందులో భాగంగా వేల్పుల రైతు భరోసా కేంద్రంలో జరిగిన రైతుల సమావేశంలో విద్యార్థులు వ్యవసాయంలో నూతన పద్ధతులపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రైతులు అడిగిన వివిధ సమస్యలకు శాస్త్రవేత్తలు సమాధానాలు సూచించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త సుశీల

కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల ప్రకృతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగిరెడ్డి, నల్లపురెడ్డిపల్లె వీహెచ్ఏలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు విక్రయించాలి

కమలాపురం : యూరియా తదితర ఎరువులన్నీ ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పు రుగు మందులు విక్రయించే డీలర్లతో సమీక్షా స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా తదితర ఎరువులన్నీ ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల చ ట్టంకు లోబడి వ్యాపారం చేయాలని స్పష్టం చేశా రు. అలాగే స్టాక్ రిజిష్టర్, బిల్ బుక్, స్టాక్ బోర్డు అందరూ షాపులోనే అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే స్టాక్ రిజిష్టర్‌కు, ఎరువుల నిల్వలకు తేడా లేకుండా చూసుకోవాలన్నారు. పురుగు మందుల డీలర్లు ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. నిషేధించబడిన పురుగు మందులు విక్రయించరాదన్నారు. మండల ఏఓ సరస్వతి, కమలాపురం, ఎర్రగుంట్ల, వల్లూరు మండలాల డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

బీటెక్ రవి.. చీకటి ఒప్పందాలు నీకే అవసరం

– నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్

పులివెందుల రూరల్ : బీటెక్ రవి.. చీకటి ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం వైఎస్ కుటుంబీకులకు లేదని అవి నీకే అవసరమని నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాకు మీరు.. మీకు మేము అని చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలు జరిగిని 20 రోజుల తర్వాత లేనిపోని మాటలు చెప్పి వైఎస్ కుటుంబంపై బురదచల్లే మాటలు మానుకోవాలన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి 7 నియోజకవర్గాల్లో ప్రచారం చేసి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారే తప్పా తనను గెలిపించాలని ఎప్పుడూ కూడా ప్రచారం చేయలేదన్నారు. 4న వచ్చే ఫలితాలను చూసి టీడీపీ నాయకులకు భారీ షాక్ తగిలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలఅశ్వర్థరెడ్డి, రాజశేఖర్, ప్రదీప్‌రెడ్డి, బాషా, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు వైఎస్ అవినాష్‌రెడ్డి

ఖాజీపేట : ప్రజా నాయకుడు ఎంపీ అవినాష్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని ఏపీఎస్ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి షర్మిల డిపాజిట్ కూడా దక్కదని ఎద్దేవాచేశారు. నిత్యం ప్రజల్లో ఉంటే అవినాష్‌రెడ్డికే ప్రజలు అండగా నిలబడ్డారని అన్నారు. కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేష్ రెడ్డిని బలిపశువును చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమావ్యక్తం చేశారు. టీడీపీకి ప్రజలు గుణపాఠం చెప్పబోతున్నారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, మున్నెల్లి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జగన్ సీఎం కావాలని ఆంజనేయ స్వామికి పూజలు

సంక్షేమ సారథి సీఎం జగన్ మళ్లీ సీఎం అవుతారని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మురళీమోహన్ రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హనుమాన్ జయంతి పురస్కరించుకుని సుంకేశుల గ్రామంలోని ఆంజనేయ స్వామి కి ప్రత్యేక పూజలు చేశారు. సీఎంగా జగన్, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డి గెలవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రక్తదాన శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు 19వ వార్షికోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ సత్యప్రకాశ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ బ్యాంకు వ్యాపార నిర్వహణలో ఇతర బ్యాంకుల కంటే ప్రగతి పథంలో ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 70 సార్లకు పైగా రక్తదానం చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డిని అభినందించారు. రీజినల్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్, ప్రధాన, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : మైదుకూరు రోడ్డులోని విత్తన దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. భారత్ సీడ్ ఏజెన్సీస్, వెంకటేశ్వర సీడ్ ఏజెన్సీల్లో రికార్డులు పరిశీలించారు. రికార్డులు, నిల్వల్లో తేడాలు ఉండటంతో దుకాణ యజమానులకు అమ్మకపు నిల్వ నోటీసులను అధికారులు జారీ చేశారు. నిబంధనలకు లోబడి విత్తనాలను రైతులకు విక్రయించాలని అధికారులు తెలిపారు. నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జి. ఈదురుబాషా, బాలగంగాధర్‌రెడ్డి, జి. శ్రీనివాసులు, జే. మురళీకృష్ణ, సుస్మిత, వ్యవసాయధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నియంత్రణ మనందరి బాధ్యత

పులివెందుల రూరల్ : క్యాన్సర్ నియంత్రణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. శనివారం మెడికల్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కడప సర్వజన ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్యులకు రెండురోజుల పాటు క్యాన్సర్ నియంత్రణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ జనాభా లెక్కల ప్రకారం 2022లో భారతదేశంలో కొత్తగా క్యాన్సర్ కేసుల సంఖ్య 14.61లక్షలపై చిలుకు ఉండేదన్నారు. సుమారు 10 లక్షల వరకు మృతి చెందడం జరిగిందన్నారు. ప్రస్తుతం 38 లక్షల మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయన్నారు. భారతదేశ వ్యాప్తంగా ప్రతి 9 మందిలో ఒకరు క్యాన్సర్ భారినపడుతున్నారన్నారు. ముఖ్యంగా పురుషులలో ఊపిరితిత్తుల క్యాన్సర్, గర్భాశయం, రొమ్ము, నోటి క్యాన్సర్‌లు మహిళలు అగ్రస్థానంలో ఉందన్నారు. 2020తో పోలిస్తే 2025 నాటికి 128 శాతం క్యాన్సర్ పెరుగుతుందని అంచనా వేయబడిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులకు క్యాన్సర్‌పై శిక్షణ ఎంతో ఉపయోగకరమన్నారు. శిక్షణ ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అనుమానంగా ఉన్న రోగులకు ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించేలా వైద్య బృందం చర్యలు తీసుకోవాలన్నారు. కలిసికట్టుగా క్యాన్సర్ వ్యాధి నియంత్రణకు మనవంతు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ ముందస్తు విభాగం నోడల్ అధికారి జీవనప్రియ, ఇన్‌చార్జి నోడల్ అధికారి కేశవకుమార్, వైద్యులు పాల్గొన్నారు.



క్యాన్సర్ నియంత్రణ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

‘బ్రౌన్’కు 500 పుస్తకాల అందజేత

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయానికి మరో 500 పుస్తకాలు చేరాయి. తిరుపతికి చెందిన ప్రొఫెసర్, రచయిత డాక్టర్ లంకిపల్లె కన్నయ్య నాయుడు తన సతీమణి సరస్వతితో కలసి శనివారం తన స్వగృహంలో 500 పుస్తకాలను బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయానికి అందజేశారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్ వీటిని స్వీకరించారు.

అంతటా అప్రమత్తం

- కౌంటింగ్ నేపథ్యంలో పోలీసుల కవాతు
- దుకాణాలు, హోటళ్లు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు
- ముందస్తుగా రౌడీషీటర్ల బైండోవర్

ఎర్రగుంట్ల : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అల్లర్లను ప్రోత్సహించి, గొడవలకు దిగితే ఉపేక్షించేదిలేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గ్రామాలలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడంతో పాటు ముందుస్తుగా రౌడీషీటర్లను బైండోవర్ చేస్తున్నారు. జూన్ 4న కౌంటింగ్ రోజు అవాంఛనీయ సంఘటనలుకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలంటూ సూచిస్తున్నారు. పోలీసులు హెచ్చరికలను పాటించకుండా గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

జమ్మలమడుగు నియోజకవర్గం పరిధిలోని 6 మండలాల్లో మొత్తం 2,42,556 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,02,789 మంది, స్త్రీలు 1,07,449 మంది, ట్రాన్స్‌జెండర్లు 3 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,10,241 మంది ఓటు వేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా 86.68 శాతం పోలింగ్ నమోదైంది. జమ్మలమడుగు నియోజకవర్గంనకు సంబంధించి పోలైన 2,10,241 ఓట్లు లెక్కింపు 23 రౌండ్లలో జరగనుంది. నియోజకవర్గంలో మొత్తం 315 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొదటగా పెద్దమొడియం మండలంలోని కొండసుంకేసులలోని పోలింగ్ కేంద్రం–1 నుంచి ఈవీఎంతో లెక్కింపు ప్రారంభమవుతుంది. అనంతరం మైలవరం, జమ్మలమడుగు రూరల్, జమ్మలమడుగు టౌన్, కొండాపురం, ముద్దనూరు మండలం తర్వాత చివరగా ఎర్రగుంట్ల మండలంలోని కర్చుకుంటపల్లె ఈవీఎం లెక్కింపు కౌంటింగ్ ముగుస్తుంది.



ఎర్రగుంట్ల, కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రామాలలో పోలీసు కవాతు చేస్తున్న పోలీసులు

ప్రత్యేక నిఘా పెట్టాం..



4వ తేదీన జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఉంచాం. ముందస్తుగా 116 మంది ట్రబుల్‌బంగర్స్‌ను గుర్తించాం. అన్ని మండలాల్లో, పట్టణంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ఏ చిన్న అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని చర్యలు చేపట్టాం. అంతేకాక ఈనెల 6వ తేదీవరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతి వ్యక్తి కదిలికపై నిఘా ఉంచాం. 6 మండాలలోని అన్ని గ్రామాలలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అల్లర్లకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– యశ్వంత్, డీఎస్పీ, జమ్మలమడుగు